ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

సంపుటి: 2 | సంచిక: 6 | పేజీలు: 4 | వెల: రూ.3/- | బుధవారం 17 ఏప్రిల్ 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్



## 'ఎక్స్'లో లైక్ కొట్టాలన్నా.. పోస్టు పెట్టాలన్నా చెల్లించాల్సిందే!

హైదరాబాద్, ఏప్రిల్ 16 (ప్రభాత ఉదయం): సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్టులకు ఛార్జ్ చేయడానికి ఎలాన్ మస్క్ సిద్ధమయ్యారు. మైక్రోబ్లాగింగ్ సైట్‌లో కొత్త యూజర్లు చేసే పోస్ట్‌తో పాటు, లైక్, రిప్లయ్, బుక్‌మార్క్ చేయాలన్నా చిన్న మొత్తంలో ఫీజు చెల్లించాల్సి రావొచ్చని బిలియనీర్ వెల్లడించారు. బాట్స్, నకిలీ ఖాతాల నివారణకు ఇది తప్పకపోవచ్చని సంకేతమిచ్చారు. ఫాలో, బ్రౌజింగ్ ఉచితంగానే చేయొచ్చని కంపెనీ పేర్కొంది. 'ఎక్స్ డైలీ న్యూస్' ఖాతా నుంచి వచ్చిన ఓ ప్రశ్నకు బదులిస్తూ మస్క్ సోమవారం ఈ విషయాన్ని వెల్లడించారు. బాట్‌ల సమస్య ..మిగతా 2లో



పాలమూరు జిల్లాకు చెందిన దోనూరు అనన్య రెడ్డికి

## యూపీఎస్సీలో మూడో ర్యాంక్

హైదరాబాద్, ఏప్రిల్ 16(ప్రభాత ఉదయం): యూపీఎస్సీ 2023 వ సంవత్సరం పరీక్షా ఫలితాలలో పాలమూరు జిల్లాకు చెందిన దోనూరు అనన్య రెడ్డి జాతీయస్థాయిలో మూడో ర్యాంకు సాధించింది. అడ్డాకుల మండలం పొన్నకల్ గ్రామానికి చెందిన దోనూరు సురేష్ రెడ్డి, మంజులత పెద్ద కుమార్తె అయిన అనన్య రెడ్డి తన పాఠశాల విద్య అంతా మహబూబ్ నగర్ పట్టణంలో పూర్తి చేసింది. 6 నుండి 10 తరగతి వరకు గీతం పాఠశాలలో చదివి ఎస్ఎస్సి లో అత్యుత్తమ గ్రేట్ పాయింట్స్ ను సాధించింది. అనంతరం ఆమె హైదరాబాద్ లోని నారాయణ ఐఏఎస్ అకాడమీలో ఇంటర్ పూర్తి చేసింది. ఢిల్లీలోని మిరండా హౌస్ లో డిగ్రీ పూర్తి చేసి యూపీఎస్సీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యింది. మొదటి ప్రయత్నంలోనే తన లక్ష్యాన్ని చేరుకొని జాతీయస్థాయిలో మూడో ర్యాంకును సాధించింది. అత్యుత్తమ ర్యాంకును సాధించడం పట్ల ఉమ్మడి పాలమూరు జిల్లా వ్యాప్తంగా విద్యావేత్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



తల్లితండ్రులతో అనన్య రెడ్డి



## గల్ఫ్ కార్మికుల కోసం ప్రత్యేక బోర్డు

### రైతుబీమా తరహాలో 5 లక్షల సాయం
### గల్ఫ్ కార్మికుల కోసం ప్రత్యేక కార్యాలయం
### గల్ఫ్ కార్మిక సంఘాల నేతలకు సిఎం రేవంత్ హామీ



హైదరాబాద్, ఏప్రిల్ 16 (ప్రభాత ఉదయం): గల్ఫ్ కార్మికులను ఆదుకునేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. గల్ఫ్ ఏజెంట్లకు చట్టబద్ధత ఉండేలా చర్యలు తీసుకుంటామని.. తెలంగాణ గల్ఫ్, ఓవర్సీస్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు పెట్టాలని నిర్ణయించినట్లు చెప్పారు. హైదరాబాద్ లోని తాజ్ డెక్కన్ లో మంగళవారం గల్ఫ్ కార్మిక సంఘాల నేతలతో సిఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు సమస్యలను వారు సీఎం రేవంత్ దృష్టికి తెచ్చారు. రాష్ట్రంలో 15 లక్షల కుటుంబాలు గల్ఫ్ ఉపాధిపై ఆధారపడి ఉన్నాయని.. కార్మికుల రక్షణ కోసం ప్రత్యేక చర్యలు చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డి, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, గల్ఫ్ ఎన్ఆర్ఐ కార్మిక సంఘాల నేతలు హాజరయ్యారు. 'గల్ఫ్ కార్మికుల సహాయార్థం ప్రజా భవన్ లో ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు చేస్తాం. సీనియర్ ఐఏఎస్ నేతృత్వంలో ప్రత్యేక వ్యవస్థను తీసుకొస్తాం. ఉపాధి కోసం వెళ్లిన వారి వేతనాలు, బాగోగులు కూడా చూసుకోవాలి. ఓవర్సీస్ కార్మికుల కోసం పిలిప్పీన్స్, కేరళలో మంచి విధానం అమల్లో ఉంది. కొన్ని దేశాలు, ఇతర రాష్ట్రాలు అవలంబిస్తున్న విధానాలపై అధ్యయనం చేస్తున్నాం. పూర్తి స్థాయి అధ్యయనం తర్వాత సమగ్ర విధానం రూపొందిస్తాం. రైతు బీమా తరహాలోనే గల్ఫ్ కార్మికులకు బీమా అందిస్తాం. గల్ఫ్ కార్మికుల ప్రమాద బీమా రూ.5 లక్షలు ఇస్తాం. జూన్, జులైలో పాలసీ డాక్యుమెంట్ విడుదల చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. గల్ఫ్ దేశాలతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఇతర దేశాలలోని చేస్తున్న తెలంగాణ ప్రవాసీయుల సంక్షేమానికి ఒక ప్రత్యేక వ్యవస్థను ..మిగతా 2లో

## కాంగ్రెస్‌పై మొదలైన ప్రజాగ్రహం

### రేవంత్ బిజెపిలో చేరడం ఖాయం
### పార్లమెంట్‌లో రెండు సీట్లు కూడా అనుమానమే
### ఈ ప్రభుత్వం ఏడాది ఉంటే మహా ఎక్కువ
### జనం తిరగబడడంతోనే సిఎంలో వణుకుడు మొదలు
### అన్ని జిల్లాల్లో రైతాంగం తిరగబడడం ఖాయం
### పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్ఎస్‌ను గెలిపించాలి
### జహీరాబాద్, మెదక్ సమావేశంలో కెసిఆర్ వ్యాఖ్యలు



సంగారెడ్డి, ఏప్రిల్ 16 (ప్రభాత ఉదయం): ఈ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 2 సీట్ల కంటే ఎక్కువ రావని సర్వే రిపోర్టులు వస్తున్నాయని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి బీజేపీలో కలిసే అవకాశం ఉందని కేసీఆర్ అన్నారు. సుల్తాన్‌పూర్‌లో ఏర్పాటు చేసిన జహీరాబాద్, మెదక్ పార్లమెంట్ నియోజకవర్గాల బహిరంగ సభలో కేసీఆర్ పాల్గొని ప్రసంగించారు. ప్రజాస్వామ్యంలో ప్రజలు అన్ని ఆలోచించి ఓటు వేయాలి. మన కండ్ల ముందే మనల్ని మోసం చేస్తుంటే.. మళ్లా వారికే సద్ది కడితే, ఓట్లు వేస్తే ఆగమవుతాం. సంగమేశ్వర, బసవేశ్వర పూర్తి కావాలన్నా, కరెంట్ మంచిగా రావాలన్నా ఈ ప్రభుత్వం మెడలు వంచాలి. కాంగ్రెస్ గెలిచిందని మాకు ఓర్వలేని తనం ఏం లేదు. వారు కూడా ఐదేండ్లు ఉండాలి. అప్పుడే నల్లదేందో తెల్లదేందో తెలుస్తది. కానీ ఈ సీఎం మాటలు చూస్తుంటే, సభల్లో ఆయన వణుకుడు చూస్తుంటే తెలంగాణ జనం తిరగబడ్డదని అర్థమవుతోంది. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 2 సీట్ల కంటే ఎక్కువ రావని సర్వే రిపోర్టులు వస్తున్నాయి. అంతటా అన్ని జిల్లాల్లో కూడా రైతాంగా తిరగబడుతుంది. అందుకే నారాయణపేట సభలో సీఎం భయం చూస్తుంటే ఈ గవర్నమెంట్ ఏడాది కూడా ఉండేటట్టు లేదని మనవి చేస్తున్నానని వ్యాఖ్యానించారు. ఎవడు ఎప్పుడు పోయి బీజేపీలో కలుస్తడో.. ముఖ్యమంత్రే ..మిగతా 2లో



ఆర్టీసీ ఎండి సజ్జనార్ కు వినతి పత్రం అందజేస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి చిన్నారెడ్డి

## వనపర్తి ఆర్టీసీ డిపోకు మరో 26 కొత్త బస్సులు మంజూరు చేయండి

### ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌తో రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ చిన్నారెడ్డి భేటీ

హైదరాబాద్, ఏప్రిల్ 16(ప్రభాత ఉదయం) వనపర్తి ఆర్టీసీ డిపోకు మరో 26 కొత్త బస్సులు మంజూరు చేయాలని కోరుతూ రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ చిన్నారెడ్డి ఆర్టీసీ ఎండికి లేఖ రాశారు.
ఈ మేరకు మంగళవారం ఆర్టీసీ ఎండీ సజ్జనార్ తో రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ చిన్నారెడ్డి బస్ భవన్ లో సమావేశమయ్యారు.
ప్రజా రవాణాలో వనపర్తి ఆర్టీసీ డిపోకు గొప్ప పేరు ప్రఖ్యాతులు ఉన్నాయని, తెలంగాణ రాష్ట్రంలోనే అతి పురాతన ఆర్టీసీ డిపోగా వనపర్తికి ఖ్యాతి ఉందని చిన్నారెడ్డి పేర్కొన్నారు.
నిజాం నవాబుల కాలంలోనే వనపర్తిలో ఆర్టీసీ డిపో ఏర్పాటు అయిందని, వనపర్తి ఆర్టీసీ డిపోకు కొత్తగా మరో 26 బస్సులు మంజూరు చేయాలని చిన్నారెడ్డి గారు ఆర్టీసీ ఎండీ సజ్జనార్ గారిని కోరారు. అందుకు ఆర్టీసీ ఎండీ సానుకూలంగా స్పందించారు.
వనపర్తి పాత బస్టాండ్ ప్రాంతాన్ని అభివృద్ధి పర్చి వాణిజ్య పరంగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని కూడా చిన్నారెడ్డి గారు ఆర్టీసీ ఎండీ ని కోరారు.
దీంతో ఆర్టీసీ కి ఆదాయం రావడంతో పాటు వనపర్తి పట్టణ ప్రజలకు వ్యాపార పరంగా లాభం చేకూరుతుందని చిన్నారెడ్డి అభిప్రాయ పడ్డారు.
దీనికి కూడా ఆర్టీసీ ఎండీ సానుకూలంగా స్పందించారని చిన్నారెడ్డి తెలిపారు..

## హామీలపై అధికార పార్టీని నిలదీయండి

### గట్టిగా కలబడితే ఆదిలాబాద్‌లో విజయం మనదే
### కాంగ్రెస్‌పై నిప్పులు చెరిగిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



ఆదిలాబాద్, ఏప్రిల్ 16(ప్రభాత ఉదయం) చీమల కలిసి బలమైన సర్పాన్ని ఎలా చంపుతాయో.. అదే పద్ధతుల్లో ఈ కాంగ్రెస్ అనే విషసర్పాన్ని గులాబీ జెండా కప్పుకున్న చలి చీమలే చావుదెబ్బ కొడుతాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన విస్తృత స్థాయి సమావేశంలో కేటీఆర్ పాల్గొని ..మిగతా 2లో



## బెంగాల్‌ను చొరబాటుదారులకు లీజుకు ఇచ్చారు

### టీఎంసీపై ప్రధాని మోదీ ధ్వజం

కోల్‌కతా, ఏప్రిల్ 16(ప్రభాత ఉదయం) పశ్చిమబెంగాల్‌లో మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ ధ్వజమెత్తారు. రాష్ట్రాన్ని ఆ పార్టీ చొరబాటుదారులు, ..మిగతా 2లో

## ఛత్తీస్‌ఘడ్‌లో మావోలకు ఎదురుదెబ్బ

### ఎన్‌కౌంటర్‌లో 29 మంది నక్సల్స్ మృతి.. భారీగా మందుగుండు, తుపాకులు స్వాధీనం



రాయ్‌పూర్, ఏప్రిల్ 16 (ప్రభాత ఉదయం): లోక్‌సభ ఎన్నికల వేళ ఛత్తీస్‌గఢ్ అరణ్యం నెత్తురోడుతోంది.. తాజాగా.. మావోయిస్టు పార్టీకి భారీ ఎదురు దెబ్బ తగిలింది. కాంకేర్ జిల్లా మాడ్ అటవీప్రాంతంలో పోలీసులకు మావోయిస్టులకు మధ్య భీకర ఎదురు కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ కాల్పుల్లో 29 మంది మావోయిస్టులు మృతిచెందారు.. ముగ్గురు జవాన్లకు గాయాలైనట్లు పేర్కొంటున్నారు. ఛత్తీస్ గఢ్ రాష్ట్రంలో మరో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య జరిగిన కాల్పుల్లో కనీసం 18 మంది మావోయిస్టులు చనిపోయారు. ఈ విషయాన్ని బీఎస్ఎఫ్ సిబ్బంది తెలిపారు. నెలరోజుల వ్యవధిలో జరిగిన ఇది ఐదవ ఎన్ కౌంటర్ కాగా, దాదాపు 10 రోజుల కిందట జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మృతిచెందారు. కాంకేర్ జిల్లా మావోయిస్టులకు ప్రాబల్యం ఉన్న ప్రాంతం.. లోక్ సభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పోలీసులు, భద్రతా బలగాలు కలిసి ..మిగతా 2లో

# గల్ఫ్ కార్మికుల కోసం ప్రత్యేక బోర్డు

మొదటి పేజీ తరువాయి...

నెలకొల్పడానికి తమ ప్రభుత్వం కసరత్తు చేస్తుందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రవాసం అనేది విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధీనంలోని వ్యవహారమని పెర్కొన్నారు. ప్రధాన మంత్రి కార్యాలయంలో విదేశీ మంత్రిత్వ శాఖ వ్యవహారాలను ఎనిమిదేళ్ళ పాటు పరిశీలించిన శేషాద్రి అనే సీనియర్ అధికారి ప్రస్తుతం తన కార్యాలయంలో సేవలందిస్తున్నారని, ప్రవాసీ సంక్షేమ విధానానికి సంబంధించి ఆయన విధివిధానాలను రూపొందిస్తున్నారని కూడా ఆయన పేర్కొన్నారు.ప్రవాసీ సంక్షేమానికి సంబంధించి విధివిధానాలను రూపొందించడానికి ముందు రాష్ట్ర ప్రభుత్వ పక్షాన తామే ప్రవాసీయులను అతిథులుగా పిలుస్తామని రేవంత్ రెడ్డి అన్నారు. ఒక సీనియర్ ఐఏయస్ అధికారి ఆధ్వర్యంలో ప్రజాభవన్‌లో ప్రవాసీయులకు సహాయం చేసే వ్యవస్థను ఏర్పాటు చేస్తామని ఆయన అన్నారు. సెప్టెంబర్ 17 లోపు దీన్ని ఏర్పాటు చేస్తామని కూడా ముఖ్యమంత్రి అన్నారు. టోల్ ఫ్రీ నెంబర్ అందుబాటులో ఉంచుతామని ఆయన తెలిపారు. విదేశాలలో మరణించిన వారికి అయిదు లక్షల రూపాయలు ఆర్థిక సహాయం అందించే విధంగా ఇప్పటికే సూత్రప్రాయంగా నిర్ణయించామని, అదే విధంగా న్యాయ సహాయం చేసే దిశగా కూడా ప్రణాళిక రూపొందిస్తామని ముఖ్యమంత్రి అన్నారు. గమ్య దేశాలకు పత్యేకించి గల్ఫ్ దేశాలకు వెళ్ళక ముందు వారికి వారం రోజుల పాటు పునశ్చరణ తరగతుల ఏర్పాటుకు కూడా ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తున్నట్లు చెప్పారు. స్వదేశంలో స్థిరాస్తులను కొనుగోలు చేసి కొంత మంది ప్రవాసీయులు మోసపోతున్నట్లుగా తాము గమనించామని, దీన్ని అరికట్టేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేస్తామని రేవంత్ రెడ్డి అన్నారు. ఉత్తర తెలంగాణ జాతీయ ప్రవంతిలో గల్ఫ్ ప్రవాసం కీలకమైన అంశమని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. స్థానికంగా ఉపాధి లభించినా, లభించకున్నా మెరుగైన జీవన



ప్రమాణాల కోసం గల్ఫ్ దేశాలకు ఉపాధి వలసలకు వెళ్తున్నారని అన్నారు. బొంబాయి, బొగ్గుబాయి, దుబాయి అంటూ తెలంగాణ ఉద్యమంలో నినదించిన ఉద్యమ సారథి పదేళ్ళుగా ఒక్కసారి కూడా ప్రవాసీయులపై కన్నెత్తి చూడకపోవడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశానికి ఎనలేని ప్రాధాన్యత ఏర్పడింది. ఈ క్రమంలో సీఎం రేవంత్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. '2018లో నేను ఓడిపోయాను కాబట్టే 2019లో ఎంపీ అయ్యాను. ఆ తర్వాత 2023లో తెలంగాణ రాష్ట్రానికి సీఎం అయ్యాను. అలాగే, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కూడా ఎమ్మెల్యేగా ఓడిపోయారు కాబట్టి.. 2024లో కేంద్ర మంత్రి అవుతారని అన్నారు. ఇక, తాను ఎమ్మెల్యేగా ఓడిపోతే కొందరు బాధ పడ్డారని.. తన శత్రువులు సంతోష పడ్డారని పేర్కొన్నారు. గల్ఫ్ వలసలు ఎక్కువగా ఉన్న నిజామాబాద్ నుండి టి.జీవన్ రెడ్డిని లోక్‌సభకు పంపించవల్సిందిగా ముఖ్యమంత్రి ప్రవాసీయులకు విజ్ఞప్తి చేసారు. నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గ అభ్యర్థి టి. జీవన్ రెడ్డి, పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, వేములవాడ శాసన సభ్యుడు ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ ప్రవాసీ ప్రముఖుడు, మాజీ ఎమ్మెల్యే ఈరబత్తిని అనిల్‌తో పాటు గల్ఫ్ దేశాల నుండి వచ్చిన ప్రతినిధులు సమస్యలను వివరించారు. సమావేశానికి మంద భీంరెడ్డి సమన్వయకర్తగా వ్యవహరించగా కృష్ణ ధోనికెని, వంశీ గౌడ్, గుండేళ్ళ నర్సింహా, గుగిళ్ళ రవి గౌడ్, గణెశ్, మీర్ ఆయూబ్ అలీ ఖాన్, గడ్డం హరిక, కోటపాటి నర్సింహానాయుడు, చింతలటన ప్రవీణ్ తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి ఖతర్ నుంచి ప్రత్యేకంగా తీసుకొచ్చిన ఖర్జూరపు పళ్ళను ఖతర్‌లోని తెలంగాణ ప్రవాసీ సంఘం నాయకుడు ఖాజా నిజామొద్దీన్ అందజేశారు.



# కాంగ్రెస్‌పై మొదలైన ప్రజాగ్రహం

మొదటి పేజీ తరువాయి...

జంప్ కొడుతడో.. ఏమైతదో తెలియని పరిస్థితి. సీఎం ఇక్కడ ఒకటి మాట్లాడుతున్నాడు. అక్కడ ఒకటి మాట్లాడుతున్నాడు. ఢిల్లీకి పోయి బీజేపీకి ఓటు వేయమని చెబుతుండు. ఏం జరుగుతంది. ఎవరు ఎవరికి బీ టీమ్. ఎవరెవరూ కలిసిపోయారు. ఒక్కసారి ఆలోచన చేయాలి. ఏమరుపాటుగా ఉంటే ఇబ్బంది జరుగుతంది. ఇంకా మోసపోతే డెబ్బతింటం అని కేసీఆర్ పేర్కొన్నారు. ఇకపోతే కాంగ్రెస్ నేతలు అంబేద్కర్‌ను అవమానించారని, నేను కట్టించానని అంబేద్కర్ విగ్రహం దగ్గరికి కాంగ్రెస్ నేతలు వెళ్లలేదని కేసీఆర్ అన్నారు. అంబేద్కర్ విగ్రహం పెట్టాక తొలి జయంతి ఇది అని, అంబేద్కర్‌ను అవమానించిన పార్టీకి తగిన బుద్ధి చెప్పాలన్నారు. రేవంత్‌కు ఇంటెలిజెన్స్ రిపోర్టు కూడా వచ్చిందని, ఏడాది కూడా ఈ సర్కార్ ఉండేలా కనిపించట్లేదని వ్యాఖ్యానించారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితి చూస్తుంటే కాంగ్రెస్ నేతల్లో కూడా భయం నెలకొందని మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. ఈ సమావేశంలో మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఛత్తీస్‌ఘడ్‌లో మావోలకు ఎదురుదెబ్బ

మొదటి పేజీ తరువాయి...

సంయుక్తంగా కూంబింగ్ నిర్వహిస్తున్నాయి.. ఈ క్రమంలో మాడ్ అటవీ ప్రాంతంలో మంగళవారం భీకర కాల్పులు జరిగాయి. పోలీసులపైకి మావోయిస్టులు కాల్పులు జరపడంతో .. వారు కూడా ఎదురుకాల్పులు జరిపారు.. ఇంకా ఎదరుకాల్పులు కొనసాగుతున్నాయని.. పోలీసులు తెలిపారు. దీంతో పాటు.. మందుగుండు సామాగ్రి, ఏకే 47, పలు తుపాకులు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొంటున్నారు.ఈ ఎన్కౌంటర్ లో మావోయిస్టు అగ్రనేతలు హతమైనట్లు పేర్కొంటున్నారు.. ఛత్తీసగఢ్‌లోని అటవీ ప్రాంతం గత నెలరోజులుగా కాల్పులతో దద్దరిల్లుతోంది. లోక్‌సభ ఎన్నికలు కావడంతో మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలపై స్పెషల్ ఫోకస్ పెట్టారు. ఛత్తీస్‌గఢ్, తెలంగాణ సరిహద్దులో, తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులోనూ ఎన్ కౌంటర్లు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మంగళవారం ఛత్తీస్ గఢ్ రాష్ట్రం కాంఖేర్ జిల్లాలోని బినగుండ అటవీప్రాంతంలో కాల్పుల మోత మోగింది. పోలీసులకు, మావోయిస్టులకు మధ్య జరిగిన కాల్పుల్లో కనీసం 29 మంది మావోయిస్టులు మృతిచెందగా.. పలువురు భద్రతా సిబ్బందికి గాయాలైనట్లు సమాచారం. ఇంకా ఎవరైనా ఉన్నారా అని ఎన్ కౌంటర్ జరిగిన చుట్టుపక్కల ప్రాంతాల్లోనూ పోలీసులు కూంబింగ్ ఆపరేషన్ కొనసాగిస్తున్నారు. డిస్ట్రిక్ రిజర్వ్ బలగాలు ఛోటెబెటియా పోలీస్ స్టేషన్ పరిధిలోని బినగుండ అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహించారు. ఈ క్రమంలో భద్రతా బలగాలను చూసిన మావోయిస్టులు వారిపై ఒక్కసారిగా కాల్పులకు తెగబడ్డారు. అలర్ట్ అయిన పోలీస్ ఫోర్స్ ఎదురుకాల్పులు జరిపింది. మావోయిస్టుల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నట్లు బీఎస్ఎఫ్ ఓ ప్రకటనలో తెలిపింది. ఏడు ఏకే సిరీస్ రైఫిల్స్, మూడు లైట్ మేషిన్ గన్స్ ను మావోయిస్టుల వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్‌లో 8 మంది మావోయిస్టులు మృతి చెందారు. గంగలూరు పోలీస్ స్టేషన్ పరిధిలో కొర్చోలి, లేంద్ర అడవుల్లో మావోయిస్టులు కాల్పులు జరపగా.. భద్రతా బలగాలు జరిపిన ఎదురుకాల్పుల్లో మావోయిస్టులు హతమయ్యారు. మరో ఎన్ కౌంటర్ లో ఆరుగురు మావోయిస్టులు హతమయ్యారు. వారి వద్ద నుంచి ఏకే-47, ఎల్ఎంజీ ఇతరత్రా ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు.

# బెంగాల్‌ను చొరబాటుదారులకు లీజుకు ఇచ్చారు

మొదటి పేజీ తరువాయి...

గూండాలకు లీజుకు ఇచ్చిందని ఆరోపించారు. సందేశ్‌ఖాలీలో మహిళలపై జరిగిన అకృత్యాలను చూసి దేశం మొత్తం నివ్వెరపోయిందన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బెంగాల్‌లోని బాలుర్‌ఘాట్‌లో నిర్వహించిన ప్రచార సభలో మోదీ పాల్గొని ప్రసంగించారు. "దేశంలోకి అక్రమంగా ప్రవేశించేవారికి టీఎంసీ మద్దతు ఇస్తుంది. కానీ, శరణార్థులకు పౌరసత్వం ఇచ్చే 'సీఏఏ'ను మాత్రం వ్యతిరేకిస్తోంది. స్థానికంగా అవినీతి, నేరాలు పెచ్చుమీరుతున్నాయి. వాస్తవాలు వెలికితీసేందుకు యత్నిస్తోన్న కేంద్ర సంస్థలపైనా దాడులు జరుగుతున్నాయి. దీన్నిబట్టి చూస్తే టీఎంసీ ఈ రాష్ట్రాన్ని చొరబాటుదారులకు, గూండాలకు అప్పగించినట్లు కనిపిస్తోంది" అని ప్రధాని మోదీ ఆరోపించారు.

### భాజపా 'బెంగాల్ వ్యతిరేక పార్టీ': దీదీ

టీఎంసీని అవినీతి పార్టీగా పేర్కొంటున్న ప్రధాని మోదీ.. ముందుగా తాను అద్దంలో చూసుకోవాలని, భాజపా మొత్తం బందిపోట్లతో నిండిపోయిందని మమతా బెనర్జీ విరుచుకుపడ్డారు. "అవినీతి ఆరోపణలపై దర్యాప్తునకు భాజపా ప్రభుత్వం 300 కేంద్ర బృందాలను రాష్ట్రానికి పంపింది. కానీ, ఇంతవరకు ఏం కనుగొనలేదు. ఈ వ్యవహారంపై శ్వేతపత్రం విడుదల చేయాలి. ఉపాధి నిధులు ఏమయ్యాయో బెంగాల్ ప్రజలకు ప్రధాని మోదీ సమాధానం చెప్పాలి" అని డిమాండ్ చేశారు.

### 'మోదీ.. సంపన్నులకు ఓ సాధనం'.. రాహుల్ విమర్శలు

భాజపాను 'బెంగాల్ వ్యతిరేక పార్టీ'గా పేర్కొన్న దీదీ.. 'ఎన్ఆర్సీ' ముసుగులో గిరిజనులు, దళితులు, ఓబీసీలను ఇక్కడినుంచి తరిమికొట్టాలని కుట్ర పన్నుతోందని ఆరోపించారు. రాష్ట్రంలో ఎన్ఆర్సీని అనుమతించబోమని తేల్చి చెప్పారు. తన కాన్వాయ్‌ను లక్ష్యంగా చేసుకుని కొందరు భాజపా నేతలు 'దొంగ దొంగ' అని అరిచారని ఆమె ఆరోపించారు. "నేను ఎంపీ పింఛన్ డ్రా చేయడం లేదు. జీతం కూడా తీసుకోను. సొంత కారులో ప్రయాణిస్తాను. సాధారణ వస్త్రాలే ధరిస్తాను. సాదాసీదా జీవితాన్ని గడుపుతున్నాను. చాయ్ ఖర్చులూ నేనే చెల్లిస్తాను" అని తెలిపారు.





# హామీలపై అధికార పార్టీని నిలదీయండి

మొదటి పేజీ తరువాయి...

ప్రసంగించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కొంత మంది నాయకులు బీఆర్ఎస్‌ను వీడారని కేటీఆర్ పేర్కొన్నారు. ముథోల్, నిర్మల్, కాగజ్‌నగర్‌లో పెద్ద నాయకులు పోయారు. అధికారం రాగానే మా వద్దకు వచ్చారు. అధికారం పోగానే మళ్లీ పోయారు. పార్లమెంట్ ఎన్నికల్లో గట్టిగా పోరాడితే.. పక్కాగా గెలుస్తాం. ఆదిలాబాద్‌లో త్రిముఖ పోటీ ఉంటుంది. బీజేపీ, కాంగ్రెస్‌పై ప్రజలు మంట మీద ఉన్నారు. మొన్న ఇచ్చిన హామీలను ప్రజల్లోకి తీసుకెళ్దాం. లంబాడా, ఆదివాసీ సోదరులకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించాం. పోడు భూములకు పట్టాలు ఇచ్చుకున్నాం. సేవాలాల్ జయంతిని అధికారికంగా జరుపుకున్నాం. కుమ్రం భీం జల్ జంగల్ జమీన్ అని అంటే దాన్ని ఆచరణలో కేసీఆర్ చేసి చూపించారు. ఇంటింటికి నీళ్లు ఇచ్చారు. ప్రతి ఎకరాకు సాగు నీరు అందించారు. హరితహారం పేరుతో జంగల్‌ను కాపాడారు. కుమ్రం భీం ఆశయాలను అలా కేసీఆర్ ముందుకు తీసుకుపోయారు. నాటి ప్రభుత్వాలు కుమ్రం భీంను గుర్తించలేదు, పట్టించుకోలేదు. జోడెన్‌ఘాట్‌లో కుమ్రం భీం స్మారక విగ్రహాన్ని ఏర్పాటు చేసి, అధికారికంగా జయంతి, వర్ధంతి ఉత్సవాలు నిర్వహించి, నిజమైన నివాళులర్పిచాం. కొత్తగా ఆసిఫాబాద్ జిల్లా ఏర్పాటు చేసి కుమ్రం భీం పేరు పెట్టి ఆయన ఆశయాలను నెరవేర్చాం అని కేటీఆర్ తెలిపారు.ఆనాడు ఇంద్రవెల్లిలో కాల్పులు జరిపింది కాంగ్రెస్ ప్రభుత్వమే. అదే ఇంద్రవెల్లికి రేవంత్ రెడ్డి వస్తాడు. సిగ్గు లేకుండా, మాటల్లో నిజాయితీ లేకుండా అమరవీరులకు క్షమాపణ చెప్పకుండా గిరిజనులను కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తుంది. ఇవన్నీ గ్రామాల్లో వివరించాలి. కాంగ్రెస్ ప్రభుత్వం మీద ప్రజలకు ఉన్న భ్రమలు తొలగిపోయాయి. మే 13న కర్రుకాల్చి వాత పెట్టాలని చూస్తున్నారు. బీఆర్ఎస్‌ను గెలిపించాలని ప్రజలు సిద్ధంగా ఉన్నారు. అధికారం శాశ్వతం కాదు.. పోయింది అధికారం మాత్రమే.. కార్యకర్తల్లో పోరాట పటిమ తగ్గలేదు. గ్రామాల్లో కార్యకర్తలు గట్టిగా ఉన్నారు. పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీసీటీ, సొసైటీ ఎన్నికల్లో ఎగిరేది గులాబీ జెండానే అని కేటీఆర్ తేల్చిచెప్పారు. రాష్ట్రంలోని నిరుద్యోగులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ నిప్పులు చెరిగారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా అమలు చేయడం లేదని మండిపడ్డారు.కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసిందని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ గవర్నమెంట్‌లో టెట్ ఫీజు రూ. 400 పెడితే.. ఇంత ఎక్కువ పెడుతారా..? అని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. అధికారంలోకి వస్తే టెట్ ఫీజు వసూలు చేయకుండా ఉచితంగా దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పిస్తామన్నారు. కానీ ఇవాళ టెట్ ఫీజు రూ. 1000 చేశారు. ఇంకా ఎంత పచ్చి మోసం చేసిందంటే ఈ కాంగ్రెస్ ప్రభుత్వం.. బీఆర్ఎస్ ప్రభుత్వం జారీ చేసిన 5 వేల డీఎస్సీ ఉద్యోగాలకు మరో 5 వేల ఉద్యోగాలు కలిపి రేవంత్ రెడ్డి నోటిఫికేషన్ ఇచ్చారు. అప్పుడేమో ఇది దగా డీఎస్సీ.. మెగా డీఎస్సీ కాదు అని రేవంత్ అన్నారు. 25 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉంటే 5 వేల పోస్టులకే నోటిఫికేషన్ ఎందుకు ఇస్తున్నావని ప్రశ్నించారు. ఇవాళ 5 వేలకు మరో 5 వేలు కలిపి పది వేలకు నోటిఫికేషన్ ఇచ్చారు. మరి ఇది దగా డీఎస్సీ కాదా..? అని కేటీఆర్ ప్రశ్నించారు. ఈ విషయాలన్నీ ప్రతి ఒక్కరికి తెలిసేలా ప్రచారం చేయాలన్నారు. గ్రూప్-1 కింద 500కు ఇంకో 60 కలిపి 560 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చారు. కాంగ్రెస్ నాయకుల మాటలేమో ఆకాశంలో.. చేతలేమో పాతాళంలో. తెలంగాణ ప్రజలను పచ్చి మోసం చేస్తున్నారు కాంగ్రెసోళ్లు అని కేటీఆర్ మండిపడ్డారు.




# బాసర ట్రిపుల్ ఐటీలో మరో విద్యార్థి సూసైడ్

## భగ్గుమంటోన్న విద్యార్థి సంఘాలు

నిర్మల్, ఏప్రిల్ 16 (ప్రభాత ఉదయం): నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్ ఐటీ యూనివర్సిటీలో మరో విద్య కుసుమం నేలరాలింది. హాస్టల్ గదిలో విద్యార్థి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు యూనివర్సిటీ అధికారులు తెలిపారు. యూనివర్సిటీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా తోగుట మండలం బండారుపల్లికి చెందిన బుచ్చుక అరవింద్ యూనివర్సిటీలో పియుసి రెండవ సంవత్సరం విద్యనభ్యసిస్తున్నాడు. వ్యక్తిగత కారణాలతో బాయ్స్ హాస్టల్ వన్ గదిలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన తోటి విద్యార్థులు యూనివర్సిటీ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే సెక్యూరిటీ సిబ్బంది విద్యార్థిని కిందకి దించి స్థానిక ఆసుపత్రికి తరలించగా అప్పటికే విద్యార్థి మృతి చెందినట్లు ఆస్పత్రి వైద్యులు ధృవీకరించారు. విద్యార్థి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిర్మల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విద్యార్థి తల్లిదండ్రులకు యూనివర్సిటీ అధికారులు సమాచారం అందించారు. ఈనెల 18 నుంచి పియుసి2 విద్యార్థులకు ఫైనల్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. విద్యార్థి 40% హాజరు శాతం ఉందని యూనివర్సిటీ అధికారులు తెలిపారు. దీంతో ఒత్తిడికి గురై విద్యార్థి మృతి చెందాడనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. విద్యార్థి మృతి పై యూనివర్సిటీ ఇంచార్జ్ వైస్ ఛాన్సర్ వెంకటరమణ సంతాపం వ్యక్తం చేశాడు. నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిమిత్తం విద్యార్థిని తరలించగా విద్యార్థి సంఘాలు అడ్డుకుని నిరసన వ్యక్తం చేశాయి.



# 'ఎక్స్'లో లైక్ కొట్టాలన్నా.. పోస్టు పెట్టాలన్నా చెల్లించాల్సిందే!

మొదటి పేజీ తరువాయి...

నివారణ కోసం ప్రస్తుతం అమల్లో ఉన్న కృత్రిమ మేధ విధానాలు సమర్థంగా పనిచేయట్లేదని తెలిపారు. 'క్యాప్చా' వంటి పరీక్షలను చాలా సులువుగా అధిగమించగలుగుతున్నాయని చెప్పారు. దీంతో ఫీజును తీసుకొస్తామని పేర్కొన్నారు. కొత్త యూజర్లు ఫీజు చెల్లించకపోయినా ఎక్స్‌లో పోస్ట్ చేసేందుకూ అవకాశం ఇస్తామని మరొకరు అడిగిన ప్రశ్నకు మస్క్ (%జుశ్రీశీఅ వీబంఎ%) బదులిచ్చారు. కానీ, అకౌంట్ క్రియేట్ చేసుకున్న తర్వాత కనీసం మూడు నెలలు వేచి చూడాలన్నారు. ఈ కొత్త విధానం ఎప్పుడు అమల్లోకి వస్తుంది? ప్రపంచవ్యాప్తంగా తీసుకొస్తారా? లేదా? అనే విషయంలో స్పష్టత రాలేదు. అక్టోబర్‌లోనే 'ఎక్స్ సపోర్ట్' దీనిపై అప్‌డేట్ ఇచ్చింది. న్యూజిలాండ్, ఫిలిప్పీన్స్‌లో కొత్త ఖాతాలకు ఏడాదికి డాలర్ ఛార్జీ వసూలు చేసే విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నట్లు తెలిపింది. ఈ ప్రాంతాలకు చెందిన కొత్త యూజర్లు ఎక్స్‌లో పోస్ట్‌ను చూడగలరు. కానీ, రిప్లై, రీపోస్ట్, కొత్త పోస్ట్ రాయడం వంటి ఆప్షన్లు మాత్రం ఉండవు. దీన్నే ఇప్పుడు ఇతర ప్రాంతాలకూ విస్తరించే యోచనలో మస్క్ ఉన్నారు.



# కవితకు బ్యాడ్ టైమ్..

## బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా

న్యూఢిల్లీ, ఏప్రిల్ 16 (ప్రభాత ఉదయం): ఈడీ లిక్కర్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత రెగ్యులర్ బెయిల్‌పై విచారణ మరోసారి వాయిదా పడింది. న్యాయమూర్తి కావేరీ భవేజా సెలవులో ఉండటం బెయిల్ పిటిషన్‌పై విచారణ ఈనెల 22వ తేదీకి వాయిదా వేశారు. ఈనెల 22వ మధ్యాహ్నం పిటిషన్‌పై విచారణ జరుగనుంది. ఇక, రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌లో భాగంగా కవిత.. ఈ కేసులో తన పాత్రకు సంబంధించి ఎలాంటి ఆధారాలులేవని పేర్కొన్నారు. తనపై అక్రమంగా కేసు పెట్టారని చెప్పుకొచ్చారు. అలాగే, నిందితులు ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా చేసుకుని తనను లిక్కర్ కేసులో ఇరికించారని కవిత చెప్పుకొచ్చారు. తన పాత్రకు సంబంధించి ఎలాంటి సాక్ష్యాలు లేవని పేర్కొన్నారు. మరోవైపు.. కవిత వాదనలను ఈడీ అధికారులు వ్యతిరేకిస్తున్నారు. ఈ క్రమంలో ఈడీ వాదనలు ఇలా ఉన్నాయి..'కవిత లిక్కర్ కేసులో కింగ్ పిన్ అని, ఆప్-సౌత్ గ్రూపునకు మధ్య కవిత దళారీగా వ్యవహరించారు. లిక్కర్ స్కాంలో భాగంగా రూ.100కోట్ల ముడుపుల వ్యవహారంలో కవితదే కీలక పాత్ర. ఇండో స్పిరిట్ ద్వారా తిరిగి ముడుపులు వసూలు చేశారు. కిక్ బ్యాగ్స్ చేరవేతలో కవిత కీలకంగా ఉన్నారు. సాక్ష్యాలు దొరకకుండా కవిత తన ఫోన్‌లో డేటాను డిలీజ్ చేశారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అలాగే, ఈడీ నోటీసులు ఇచ్చాక వాట్సాప్ డేటాను డిలీట్ చేశారు. డిజిటల్ ఆధారాలు లేకుండా ముందు జాగ్రత్తపడ్డారు. కవితా చాలా పలుకుబడి ఉన్న వ్యక్తి. ఆమెకు నోటీసు ఇచ్చిన వెంటనే అరుణ్ పిళ్లై తన వాంగ్మూలం ఉపసంహరించుకున్నారు. అరుణ్‌ను బెదిరించి వాంగ్మూలం ఉపసంహరించుకునేలా చేశారు. ఆమెకు బెయిల్ ఇస్తే సాక్షులకు ప్రభావితం చేయగలరు. సాక్ష్యాలను ధ్వంసం చేస్తారు. కాబట్టి ఎట్టి పరిస్థితుల్లో కవితకు బెయిల్ ఇవ్వకూడదు' అని కోరుతున్నారు.

# ఐక్యతతో ప్రార్థన చేసినప్పుడు జయం పొందుతాం

## రెవరెండ్ ఎం యేసుపాల్

### శివరాంపల్లి ఇజ్రాయెల్ క్రైస్ట్ మినిస్ట్రీస్ చర్చ్ లో జరిగిన పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశంలో బైబిల్ సందేశాలను అందచేసిన రెవరెండ్ యేసుపాల్


రెవరెండ్ ఎం యేసుపాల్ ను సన్మానిస్తున్న రాజేంద్రనగర్ మండల పాస్టర్స్ ఫెలోషిప్ కార్యవర్గ సభ్యులు


వందన సమర్పణ చేస్తున్న పద్మ ఇజ్రాయెల్ పాస్టరమ్మ

బుద్వేల్, ఏప్రిల్16(ప్రభాత ఉదయం): క్రైస్తవ సంఘాల కాపరులు ఐక్యతతో కలిసి పరిస్థితులన్నిటిని బట్టి ప్రార్థించినప్పుడు జయం పొందుకుంటారని మన్నా మినిస్ట్రీస్ యూత్ ప్రెసిడెంట్, ఇంటర్నేషనల్ వర్షిప్ లీడర్, సంగారెడ్డి రాక్ చర్చ్ పాస్టర్ రెవరెండ్ ఎం యేసుపాల్ అన్నారు. శివరాంపల్లిలోని ఇజ్రాయిల్ క్రైస్ట్ మినిస్ట్రీస్ చర్చ్ లో మంగళవారం రాజేంద్రనగర్ మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఉపాధ్యక్షుడు రెవరెండ్ సీహెచ్ సునీల్ సామ్యూల్ అధ్యక్షత న జరిగిన రాజేంద్రనగర్ మండల పాస్టర్ ఫెలోషిప్ సమావేశంలో రెవరెండ్ ఎం. యేసుపాల్ పాల్గొని బైబిల్ సందేశాలను అందజేశారు. ఇది నా సంఘం... అది నీ సంఘం అని కాదని ఇది దేవుని సార్వత్రిక సంఘం అని గుర్తెరిగి సేవ కొనసాగించాలన్నారు. దేవుని కొరకు సంఘాన్ని సిద్ధపరచాలన్నారు. సేవకులైన మనం మన ప్రాంతాల కొరకు నిలబడాలన్నారు. అదే సమయంలో ఐక్యంగా ప్రార్థన చేయాలన్నారు. అప్పుడే మనం గెలవగలుగుతామన్నారు. దేవుడు సహించలేనిది సంఘ కాపరులు సహించ కూడదన్నారు. నమ్మకంతో ప్రార్థిస్తే రాజులను సైతం మనకు సహాయం చేసేటట్లు మారుస్తాడన్నారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ మండల పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు రెవరెండ్ కె. సుందర్ పాల్, ప్రధాన కార్యదర్శి రెవరెండ్ ఎ. మనోహరం, కోశాధికారి రెవరెండ్ జె. పి పాల్, రెవరెండ్ రాజారామ్, రెవరెండ్ ఆనంద్ పాల్, పద్మ ఇజ్రాయెల్ పాస్టరమ్మ, పాస్టర్ బట్టు శ్రీకాంత్, బ్రదర్ విల్సన్ లతో పాటు రాజేంద్రనగర్ మండలానికి చెందిన పాస్టర్లు పాల్గొన్నారు.

**రెవరెండ్ ఎం. యేసుపాల్ కు సన్మానం :**

పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశంలో బైబిల్ సందేశాలను అందచేసిన రెవరెండ్ ఎం యేసుపాల్ ను ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. 12 సంవత్సరాల క్రితం రాజేంద్రనగర్ మండలంలో పాస్టర్స్ ఫెలోషిప్ ఏర్పాటుకు మన్నా మినిస్ట్రీస్ వ్యవస్థాపక అధ్యక్షులు బిషప్ ఎర్నెస్ట్ పి. కోమానపల్లి కి సహకరించి న రెవరెండ్ ఎం యేసుపాల్ మనందరికీ మార్గదర్శిగా ఉన్నారన్నారు.

**సాక్ష్యం :**

పద్మ ఇజ్రాయెల్ పాస్టరమ్మ దేవుడు సంఘం పట్ల చేసిన మేలులను సాక్ష్యం రూపంలో వివరించారు. మా సంఘం లో పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశం ఏర్పాటు చేయడం సంతోషకరం అన్నారు. అనంతరం పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు రెవరెండ్ కె. సుందర్ పాల్, ఉపాధ్యక్షుడు రెవరెండ్ సీహెచ్ సునీల్ సామ్యూల్ లను చర్చి సభ్యులు సన్మానించారు.


తులసీరాం చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పిస్తున్న అభిమానులు

## పార్లమెంట్ మాజీ సభ్యులు వి.తులసిరామ్ సేవలు మారువలేనివి

బుద్వేల్, ఏప్రిల్16(ప్రభాత ఉదయం):పార్లమెంట్ మాజీ సభ్యులు వి తులసి రామ్ 4వ వర్ధంతి సందర్భంగా రాజేంద్రనగర్ చౌరస్తా లో మంగళవారం ఆయన చిత్ర పటానికి ఘనంగా నివాళులర్పించారు. తులసిరామ్ చేసిన సేవలను కొనియాడారు . ఆయన కృషితోనే శివరాం పల్లిలో జాతీయ పోలీస్ అకాడమీ ఏర్పడిందన్నారు . బహదూర్ పుర నుంచి షాద్ నగర్ వరకు విద్యుత్ సౌకర్యం తులసిరామ్ కృషి ఫలితమే అన్నారు. ఈ కార్యక్రమంలో జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షులు పచ్చ నర్సింగ్ రావు , మాజీ అధ్యక్షులు గుడిసె యాదయ్య, పంబాల రాజు, మంత్రి చంద్రశేఖర్, సలహాదారులు కె. శంకర్రావు మాదిగ , పత్తి రాజు, శ్రీరాములు, ఎస్. జగదీశ్వర్(జ్యోతి), జంగయ్య, చిన్న బండి రాజు, డాక్టర్ వి శ్రీరాములు, పెంటయ్య, బచ్చుల మహేష్, నారాయణ ముదిరాజ్, కొమిరె గణేష్ , ప్రసాద్ , శ్రీకాంత్, రవి, రమేష్, నవ జ్యోతి యూత్ క్లబ్ అధ్యక్షులు వేముల వెంకటేష్, మంగలారం శ్రీనివాస్, మహేష్ లు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక

## చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల కోసం రాజేంద్రనగర్ తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాట్లు పూర్తి

బుద్వేల్, ఏప్రిల్16(ప్రభాత ఉదయం): చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ కోసం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్టు చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక వెల్లడించారు. మంగళవారం రాజేంద్రనగర్ తహసిల్దార్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఏప్రిల్ 18వ తేదీ నుండి నామినేషన్ల స్వీకరణ చేపట్టనున్నట్టు వెల్లడించారు. రాజేంద్రనగర్ తహసిల్దార్ కార్యాలయంలో నామినేషన్ల ను స్వీకరించనున్నట్టు తెలిపారు. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. పార్లమెంట్ పరిధిలోని మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి , చేవెళ్ల , పరిగి, వికారాబాద్ , తాండూర్ నియోజకవర్గాలలో మొత్తం 29 లక్షల 28,186 మంది ఓటర్లుగా నమోదైనట్టు తెలిపారు. ప్రస్తుతం ఎన్నికల కమిషన్ ఇచ్చిన కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియకు సంబంధించిన దరఖాస్తుల తో పాటు ఇతర 15 వేల దరఖాస్తులు ఉన్నాయన్నారు . వాటినన్నిటిని అధికారులు పరిశీలిస్తున్నట్టు తెలిపారు . ఈ సంఖ్య మరింత పెరుగనుందన్నారు. ప్రతిరోజు తహసిల్దార్ కార్యాలయంలో ఉదయం 11 గంటల నుండి మూడు గంటల వరకు నామినేషన్లను స్వీకరించనున్నట్లు తెలిపారు. నామినేషన్ వేసేందుకు వచ్చే అభ్యర్థితో పాటు మరో నలుగురిని మాత్రమే లోనికి అనుమతి ఇస్తామన్నారు. 18వ తేదీ నుండి 25వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ కొనసాగుతుందన్నారు. 21వ తేదీన పబ్లిక్ హాలిడే నేపథ్యంలో ఆరోజు ఎలాంటి నామినేషన్లను స్వీకరించమని వెల్లడించారు. 26వ తేదీన స్క్రూటిని , 27వ తేదీ నుండి 29వ తేదీ వరకు విత్ డ్రాకు అవకాశమిచ్చినట్టు తెలిపారు. మొత్తం ఏడు నియోజకవర్గాలలో 29 లక్షల 28వేల 186 మంది ఓటర్లలో 14,99,261 మంది పురుషులు 14 లక్షల 28 వేల 645 మంది మహిళలు 280 మంది ఇతరులు ఓటర్లుగా నమోదైనట్లు తెలిపారు . చేవెళ్ల పార్లమెంటులో మొత్తం 2824 పోలింగ్ బూత్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పార్లమెంట్ పరిధిలో 13,448 మంది ఉద్యోగులు ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నట్టు తెలిపారు. అంతే స్థాయిలో పోలీసులు సైతం విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు.


వెబినార్‌లో పాల్గొన్న వ్యవసాయ విశ్వవిద్యాలయం రిగిస్ట్రార్ డాక్టర్ ఎం. వెంకటరమణ

## ఇంటర్నెట్-ఈ-మెయిల్ సెక్యూరిటీపై వెబినార్

బుద్వేల్, ఏప్రిల్16(ప్రభాత ఉదయం): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, కంప్యూటర్ సెంటర్ ఆధ్వర్యంలో మంగళవారం ఇంటర్నెట్ అండ్ ఈ-మెయిల్ సెక్యూరిటీ పై వెబినార్ నిర్వహించింది. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ ఎం. వెంకటరమణ ఈ వెబినార్ ను ప్రారంభించారు. ప్రపంచమంతా సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, వాటి బారిన పడకుండా ఉండేందుకు ఇటువంటి వెబినార్ లు ఎంతో దోహదం చేస్తాయన్నారు. విశ్వవిద్యాలయం పరిధిలోని అన్ని కళాశాలలో విద్యార్థులకు, అధ్యాపకులకు ఇంటర్నెట్, ఈ-మెయిల్ సెక్యూరిటీ పై అవగాహన కల్పించేందుకు వెబినార్ లను, సెమినార్లను నిర్వహించాలని సూచించారు. హైదరాబాద్ సి-డాక్ కు చెందిన ప్రాజెక్టు మేనేజర్ ఎం. జగదీష్ బాబు ఇంటర్నెట్ అండ్ ఈ -మెయిల్ సెక్యూరిటీ పై అవగాహన కల్పించారు. ఫేక్ మెసేజ్ ల నుండి ఎలా కాపాడుకోవాలో సూచించారు. ఈ-మెయిల్ లకు వచ్చే జంక్ మెసేజ్ లు, స్పామ్ మెసేజ్ ల నుంచి ఎంత దూరంగా ఉంటే అంత మంచిదని అన్నారు. ఫేక్ యూఆర్ఎల్ లను గుర్తించేందుకు అందుబాటులో ఉన్న ఆన్ లైన్ ప్లాట్ ఫాం లపై ఆయన అవగాహన కల్పించారు. ఈ వెబినార్ లో దాదాపు 150 మంది అధ్యాపకులు, విద్యార్థులు, విశ్వవిద్యాలయ పరిధిలోని వివిధ పరిశోధన స్థానాలు, కళాశాలల నుంచి పాల్గొన్నారు. ఇంటర్నెట్ మరియు ఈమెయిల్ సెక్యూరిటీ ఆవశ్యకత గురించి కంప్యూటర్ సెంటర్ ఇన్చార్జి, యూనివర్సిటీ గ్రంథ పాలకుడు డాక్టర్ ఎన్.పి రవికుమార్ వివరించారు.

## ఇండియన్ ఫైటో పాథాలజికల్ సొసైటీ సెంట్రల్ జోన్ అధ్యక్షునిగా డాక్టర్ బి. విద్యాసాగర్ నియామకం


డాక్టర్ బి. విద్యాసాగర్

బుద్వేల్, ఏప్రిల్16(ప్రభాత ఉదయం): భారతదేశ శాస్త్రీయ విజ్ఞాన రంగంలో పేరెన్నికగన్న ఇండియన్ ఫైతో పాతాలజికల్ సొసైటీ (ఐ పీ ఎస్) సెంట్రల్ జోన్ అధ్యక్షుడి గా డాక్టర్ బి. విద్యాసాగర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఐ పీ ఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి, కె.కె బిశ్వాస్ ఈ నియామక పత్రాన్ని డాక్టర్ విద్యాసాగర్ కు అందించారు. గత 75 సంవత్సరాలుగా ఈ సొసైటీ పంటలపై వచ్చు తెగుళ్లపై పరిశోధనలను ప్రోత్సహించి, దేశ ఆహార భద్రతకల్పించడమనే ఒక ఉన్నత లక్ష్యంతో పనిచేస్తుంది. డాక్టర్ బి. విద్యాసాగర్, రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాలలోప్లాంట్ పాథాలజీ విభాగం అధినేతగా పనిచేస్తున్నారు. అంతేకాకుండా వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తల సంఘం అధ్యక్షునిగా చిరపరిచితుడు. ఒక జాతీయస్థాయి సొసైటీకి, వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త జోనల్ అధ్యక్షుడిగా ఎన్నిక కావడం ఇదే తొలిసారి. డాక్టర్ విద్యాసాగర్ నియామకం పట్ల యూనివర్సిటీ అధికారులు మరియు శాస్త్రవేత్తలు హర్షం వ్యక్తం చేశారు. రాజేంద్రనగర్ లోని చిరుధాన్యాల పరిశోధనల శాస్త్రవేత్త జి. రాజేష జోనల్ కౌన్సిలర్ గా ఎన్నికయ్యారు.


ట్యాంకర్ల బుకింగ్ రిజిస్టర్ ను తనిఖీ చేస్తున్న జలమండలి ఎండి సుదర్శన్ రెడ్డి

## నగర ప్రజలకు మంచినీటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు

### జలమండలి ఎండి సుదర్శన్ రెడ్డి


**జలమండలి ఉన్నతాధికారులతో ఎండీ టెలీ కాన్ఫరెన్స్**

హైదరాబాద్, ఏప్రిల్ 16(ప్రభాత ఉదయం) నగర ప్రజలకు నీటి తరఫరా లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు జలమండలి ఎండి సుదర్శన్ రెడ్డి తెలిపారు. మంగళవారం జలమండలి ఉన్నతాధికారులతో ఎండీ సుదర్శన్ రెడ్డి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఖైరతాబాద్ లోని ప్రధాన కార్యాలయంలో మంగళవారం జరిగిన ఈ కాన్ఫరెన్స్ లో డివిజన్ల వారీగా ట్యాంకర్ల బుకింగ్స్, డెలివరీ, పెండెన్సీ, పర్యవేక్షణ, అదనపు ట్యాంకర్లు, రోజువారీ, రాత్రి వేళల్లో సరఫరా చేసే ట్రిప్పులు, నీటిసరఫరా, అదనపు జలాల కేటాయింపు తదితర అంశాలపై ఎండీ సమీక్షించారు. డివిజన్ల వారీగా వివరాల్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ట్యాంకర్ ట్రిప్పులు, నీటి సరఫరాలో ఎదురయ్యే సమస్యల గురించి ఆరా తీశారు. నీటి సరఫరా, లో ప్రెజర్ సమస్యలు ఎప్పటి కప్పుడు పరిష్కరించుకోవాలన్నారు. ట్యాంకర్ డెలివరీలో ఆలస్యం లేకుండా చూడాలని.. ఒకవేళ ఆలస్యమైతే వినియోగదారులకు సందేశం పంపించాలన్నారు. అంతకు ముందు నారాయణగూడ, చిలకల గూడలో ఉన్న ఫిల్లింగ్ స్టేషన్స్ పరిశీలించారు. లాగ్ బుక్స్, నీటి సరఫరా వివరాల్ని అడిగి తెలుసుకున్నారు.


పవన్ రాజుకు నియామక పత్రాన్ని అందచేస్తున్న గుంజ బాబు రావు

## రాజేంద్రనగర్ డివిజన్ బీజేపీ ఉపాధ్యక్షుడుగా పవన్ రాజు

బుద్వేల్, ఏప్రిల్16(ప్రభాత ఉదయం) : రాజేంద్రనగర్ డివిజన్ బీజేపీ ఉపాధ్యక్షుడిగా మాణిక్యమ్మ కాలనీకి చెందిన ఆర్ పవన్ రాజు నియమితులయ్యారు. ఈమేరకు మంగళవారం రాజేంద్రనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు గుంజ బాబురావు ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు . ఈ కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై శ్రీధర్, నాయకులు వై గోపాల్, ఎస్ పెంటయ్య , టి మల్లేష్, జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.



చిన్నారి ప్రశస్త వేసిన రామబాణం -రూప

# పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయం


దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జిఎంఆర్, ఎంపీ అభ్యర్థి డాక్టర్ వంశీచంద్ రెడ్డి

### ప్రజా ఆశీర్వాదంతో విజయం సాధిస్తా: వంశీ చంద్ రెడ్డి

కొత్తకోట, ఏప్రిల్ 16(ప్రభాత ఉదయం) పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయమని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి అన్నారు. మంగళవారం పార్లమెంటు ఎన్నికలను పురస్కరించుకొని కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో నిర్వహించిన కొత్తకోట టౌన్, మండల, మదనపురం మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకుల, కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశానికి ముఖ్య అతిధులుగా హాజరై పార్లమెంట్ ఎన్నికలపై కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు దిశ నిర్దేశం చేసిన మహబూబ్ నగర్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీ చంద్ రెడ్డి , దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి దిశ నిర్దేశం చేశారు . ఈ సందర్భంగా దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూధన్ రెడ్డి మాట్లాడుతూ... మహబూబ్ నగర్ పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమన్నారు, గత పదేళ్ళలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా, దేవుని అడ్డం పెట్టుకొని నీచ రాజకీయాలకు బీజేపీ పాల్పడుతుందని, బిజెపి నీచ రాజకీయాలను తిప్పి కొట్టాలన్నారు, గత పదేళ్లు కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలో ఉండి విద్యార్థులకు, నిరుద్యోగులకు, రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మళ్లీ ఏం మొహం పెట్టుకుని బిజెపి ఓట్లు అడుగుతుందని ప్రశ్నించారు, ముఖ్యంగా డీకే అరుణ రామరాజ్యం కోసం బిజెపికి ఓటెయ్యాలి అంటున్నారు... గత పదేళ్లు కేంద్రంలో ఉన్నది రామరాజ్యం కాదా...లేక రాక్షస రాజ్యమా అంటూ జియంఆర్ ప్రశ్నించారు..కాంగ్రెస్ పార్టీలో ఉ ండి 10 ఏళ్ళు అధికారం అనుభవించి, ఏం మొహం పెట్టుకుని డీకే అరుణ బిజెపి తరపున ఓట్లు అడుగుతోందని తీవ్రంగా విరుచుకుపడ్డారు, ఎమ్మెల్యేగా, మంత్రిగా రాజకీయ భిక్ష పెట్టిన కాంగ్రెస్ పార్టీని డీకే అరుణ విమర్శించడం అంటే తిన్నింటి వాసాలు లెక్కబెట్టడం లాంటిదని పేర్కొన్నారు.

గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను చిన్నబిన్నం చేసిన, కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దుకుంటూ ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నామని తెలిపారు, అందులో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన రెండు రోజుల్లోనే రెండు గ్యారంటీలు (ఉచిత బస్, 10 లక్షల రూపాయల ఆరోగ్యశ్రీ బీమా) అమలు చేసిందని, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 లకే గ్యాస్ సిలిండర్ హామీలను నెరవేర్చిందని ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా మహబూబ్ నగర్ జిల్లాలో ఈ పథకాలు అమలుకు నోచుకోలేదని, ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేస్తామని త్వరలో రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని, ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని తెలియజేశారు, కాంగ్రెస్ శ్రేణులు అసెంబ్లీలో ఎన్నికల్లో ఆదరించినట్లే పార్లమెంట్ ఎలక్షన్ లో కూడ కాంగ్రెస్ పార్టీని ఆదరించి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్ రెడ్డి ని భారీ మెజారిటీ తో గెలిపించాలని ఎమ్మెల్యే జియంఆర్ కోరారు. అనంతరం కొత్తకోట, మదనపురం మండలాలకు చెందిన బిఆర్ఎస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూధన్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు, ఈ సందర్భంగా వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా జిఎంఆర్ ఆహ్వానించారు.

# లోక్‌సభ ఎన్నికల కోడ్‌లో బాగంగా మద్యం, డబ్బు అక్రమ రవాణాపై నిఘా ఉంచాలి

**నమోదు అయిన ప్రతి కేసులో సాక్ష్యాలను సేకరించి పారదర్శకంగా విచారణ చేపట్టాలి**

**గ్రామాలలో విజిబుల్ పోలీసింగ్ పెంచి అవసరమైన సమచారం సేకరించాలి**

**నెలవారీ నేర సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ రితిరాజ్**



పోస్టర్ ను చూపిస్తున్న ఎస్పీ రితిరాజ్

గద్వాల, ఏప్రిల్ 16(ప్రభాత ఉదయం)పార్లమెంట్ ఎన్నికల కోడ్ లో భాగంగా జిల్లాలో, సరిహద్దులో మద్యం, నగదు అక్రమ రవాణా పై నిఘా ఉంచి పట్టుకోవాలని, ఆయా పోలీస్ స్టేషన్ లలో నమోదు అయిన ప్రతి కేసుల్లో సాక్ష్యాలను సేకరించి పకడ్బందీ గా విచారణ చేపట్టాలని జిల్లా ఎస్పీ రితిరాజ్ పోలీస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలు నందు జిల్లా పోలీస్ అధికారులతో సర్కిల్ వారి గా జిల్లా ఎస్పీ నెలవారీ నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.

ఈ నేర సమీక్షలో ఆయా పోలీస్ స్టేషన్ లలో నమోదు అయిన కేసులలో అరెస్ట్ పెండింగ్ కు గల కారణాలను తెలుసుకొని, అవసరమైన చర్యలు చేపట్టి అరెస్టు చేయవలసిందిగా అధికారులను ఆదేశించారు. నమోదు అయిన కేసులలో కొన్ని కేసులు ఇంకా యుఐ లో ఉండటానికి గల కారణాలను పరిశీలించారు. యుఐ కేసులకు అవసరమైన డీఎన్ఏ,ఎఫ్ఎస్ఎల్ ,మెడికల్ రిపోర్ట్స్ ను పెండింగ్ ఉంచకుండా వెంటనే తీపించుకొని కోర్టు లో చార్జ్ షీట్ వేయాలని సూచించారు. కేసులలో విచారణలో అవసరమైన క్లూస్ ను,ప్రతి సాక్ష్యాన్ని సేకరించాలని ఆదేశించారు. కేసుల విచారణకు సంబందించి ప్రతి అంశం పేపర్ లో పొందుపరచి రికార్డు చేసి ఉండాలని అన్నారు. మిస్సింగ్, ప్రాపర్టీ ,రోడ్డు ప్రమాదాల కేసుల ఫైల్స్ ను పరిశీలించి చేపట్టాల్సిన చర్యలపై పలు ఆదేశాలు జారీ చేశారు . పోలీస్ స్టేషన్ ల వారిగా ప్రతి కేసు ఫైల్ ను పరిశీలించి వాటికి అవసరమైన క్లూస్ ను సేకరించుట, రిపోర్ట్ లు పెండింగ్ లేకుండా తెచ్చుకొనుట గురించి, స్టేషన్ రికార్డ్స్ అప్డేట్ చేయుట గురించి తగు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా ఎస్పీ రితిరాజ్ మాట్లాడుతూ... రాబోయే పార్లమెంటు ఎన్నికల దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ ఎన్నికల సంఘం సూచనల ప్రకారం బాధ్యతగా విధులు నిర్వర్తించాలని తెలియజేసారు. జిల్లాలో మరియు జిల్లా సరి హద్దులో మద్యం, నగదు అక్రమ రవాణా జరుగకుండా పకడ్బందీ నిఘా ఉంచి పట్టుకోవాలని, చెక్ పోస్టు లలో నిరంతర తనిఖిలు చేయడం తో పాటు నది తీరా ప్రాంతాలలో బ్లూ కోల్ట్ సిబ్బంది తో నిఘా పెంచాలని ఆదేశించారు. సరైన ఆధారాలు లేకుండా ఎవరైనా పరిమితికి మించి నగదును రవాణా చేస్తూ పట్టుబడితే ఎన్నికల నియమావళి ప్రకారం కేసుల నమోదు చేసి సీజ్ చేసిన నగదును డిస్ట్రిక్ట్ రిడ్రీసల్ కమిటీకి అప్పగించాలని తెలిపారు.

ప్రజలంతా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా వారిలో భరోసా కల్పించే విధంగా పనిచేయాలని తెలిపారు. గ్రామాలలో సిబ్బంది రెండు రోజులకు ఒక సారి తిరుగుతూ గ్రామ సమచారం తో పాటు అక్రమ రవాణ పై నిఘా ఉంచాలని అన్నారు.

నేర నియంత్రణకు, నేర చేదనకు ఎంతగానో ఉపయోగ పడే సీసీ కెమెరాలను నేను సైతం,కమ్యూనిటీ పోలిసింగ్ ద్వారా వాటి ప్రాముఖ్యతను తెలియజేసి గ్రామాలలో, పట్టణ కాలనీలలో ప్రజలతో అవగాహనా కార్యక్రమాలు చేపట్టి వాటి నీ ఏర్పాటు చేసుకునే విదంగా ప్రజలను ప్రోత్సహించాలని అన్నారు. అలాగే బాల్య వివాహాలు, సైబర్ నేరాలు , డ్రగ్స్ , ఎలోప్మెంట్ కేసులపై కమ్యూనిటీ ప్రోగ్రామ్ లు నిర్వహి%శీ%చి ప్రజలను చైతన్యం చేయలని అన్నారు. సైబర్ నేరాలకు సంబంధించి ఫ్రిజ్ అయిన ఖాతాలలో ఉన్న నగదును పుట్ ఆన్ హెూల్డ్ లో ఉంచి కోర్టు అనుమతీ ద్వారా భాదితులకు అందజేయలని సూచించారు. పోలీస్ స్టేషన్ కు వచ్చే ప్రతి ఫిర్యాదును ఆన్లైన్ లో ఎంట్రీ చేయలని, రోజు వారిగా సిబ్బంది విధులను రికార్డ్ చేసే జనరల్ డైరీ ను అప్డేట్ చేసుకోవాలని సూచించారు. ప్రాపర్టీ కేసుల చేదనకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని , వాటికి అవసరమైన అన్ని రకాల క్లూస్ ను సేకరించి త్వరగా చేసించాలని అన్నారు.

**యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి- జిల్లా ఎస్పీ**

తెలంగాణ రాష్ట్ర యాంటీ నార్కోటిక్స్ బ్యూరో అధ్వర్యంలో గంజాయి , కల్తీ కల్లు వినియోగం వల్ల జరిగే అనర్థాలపై రూపోందిన వాల్ పోస్టర్‌ను జిల్లా పోలీస్ కార్యాలయం లో జిల్లా ఎస్పీ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. రాష్ట్రంలో గంజాయితో పాటు కల్తీ కల్లు వినియోగం ద్వారా వ్యక్తులతో పాటు సమాజానికి జరిగే నష్టాన్ని తెలిపే విధంగా రూపోందించిన ఈ వాల్ పోస్టర్‌లో గంజాయి, కల్తీ కల్లు విక్రయాలకు పాల్పడితే ఫిర్యాదు చేయాల్సిన టోల్ ఫ్రీ నంబర్‌తో ఈ అవగాహన పోస్టర్లను రూపోందించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలను అరికట్టడం లో ప్రతి ఒక్కరు భాగస్వామ్యులు కావాలని, గంజాయికి బానిసలుగా మారి యువత తమ భవిష్యత్తు నాశనం చేసుకొంటుందని దాని వలన వారి జీవితాలు విచ్ఛిన్నం కావడంతో పాటు తల్లిదండ్రులు మానసిక క్షోభకు గురైవుతున్నారని, గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రజలందరు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి గంజాయి, మత్తు పదార్థాల విక్రయాలకు పాల్పడేవారి సమాచారాన్ని ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గొప్యంగా వుంచబడుతాయని, గంజాయి రహిత జిల్లా కోసం అధికారులు, సిబ్బంది కృషి చేయాలనీ ఎస్పీ సూచించారు. ఈ సమావేశంలో డి.ఎస్పీ కె.సత్యనారాయణ, సైబర్ సెక్యూరిటీ బ్యూరో డి.ఎస్పీ సత్తయ్య, గద్వాల్, ఆలంపూర్ , శాంతి నగర్ సి. ఐ లు భీమ్ కుమార్, రవి బాబు, కె. ఎస్. రత్నం, జిల్లా లోని అన్ని పోలీస్ స్టేషన్ ల ఎస్సై లు , డిసి ఆర్బి, ఐటీ, విభాగాల ఎస్సై లు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారం కోసం సంఘటిత పోరాటాలు

గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్16(ప్రభాత ఉదయం) సంఘటిత,అసంఘతరంగంలో ఉన్న కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ఉండి పోరాటాలు చేసినప్పుడే సమస్యలు పరిష్కారం అవుతాయని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఏ. వెంకటస్వామి అన్నారు. మంగళవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో జరిగిన గద్వాల మండల జనరల్ బాడీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరుయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సంఘటిత రంగం అసంఘటిత రంగంలో ఉన్న కార్మికుల సమస్యల పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని కనీస వేతనాల కోసం పని ప్రదేశాల మౌలిక సదుపాయాల కోసం అధికార వేధింపులకు వ్యతిరేకంగా వారి ఉద్యోగ భద్రత కోసం కార్మికులు సంఘటితంగా ఉండి ఐక్యంగా



పోరాటాలు చేసినప్పుడే సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు.కార్మిక వర్గాన్ని సంఘటితం కాకుండా ప్రభుత్వాలు కులాల పేరుతో మతాల పేరుతో ప్రాంతాల పేరుతో వారిని వేరుపరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక వర్గం, పాలకులు చేసే ఈ విచ్ఛిన్నకర విధానాలను అర్థం చేసుకొని కార్మిక వర్గ పోరాటాలలో ముందు నిలవాలని కోరారు. కార్మిక వర్గం ఐక్యంగా ఉంటే పాలకుల ఆటలు సాగవు అని అందుకే ప్రజల మధ్య వివిధ రకాల విభేదాలు సృష్టించి కార్మిక వర్గ పోరాటాలను అణచివేస్తున్నారని అన్నారు. కార్మిక వర్గం తాను కష్టపడి సృష్టించిన సంపదపై హక్కును కోల్పోతున్నదని, సంపాదన సృష్టించిన కార్మిక వర్గానికి ఆ ప్రతిఫలాలు దక్కకుండా ప్రభుత్వాలు బడా పెట్టుబడిదారులు కార్పొరేట్ శక్తులకు దేశంలోని సహజ వనరులను ధారా దత్తం చేస్తున్నారని విమర్శించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేసే కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు ఐక్యంగా ఉండి తమ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అనంతరం గద్వాల మండల కమిటీని 22 మందితో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు అధ్యక్షుడిగా రాజేష్ ప్రధాన కార్యదర్శిగా ఉప్పేర్ నరసింహ ఉపాధ్యక్షులుగా మోహనదేవి పద్మ బాలరాజ్ నరేష్ విష్ణు సహాయ కార్యదర్శులుగా భాగ్య మాధమ్మ పద్మ రామకృష్ణ కోశాధికారిగా తిమ్మప్ప మరో 10 మందిని కమిటీ సభ్యులుగా మొత్తం 22 మందితో మండల కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో వెంకటరామయ్య బాలు వెంకటన్న పాల్గొన్నారు.



నాటు సారా ను ధ్వంసం చేస్తున్న పోలీసులు

# నాటు సారా స్థావరాలపై పోలీసుల దాడులు

గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 16(ప్రభాత ఉదయం)జిల్లా మధ్యనిషేధ మరియు ఎక్సైజ్ అధికారి అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం నాటు సారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ ఘటనలో 500 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేయగా, 7 లీటర్ల నాటుసార స్వాధీనం చేసుకొని ముగ్గురిపై కేసులు నమోదు చేశారు. గద్వాల్ ఎక్సైజ్ స్టేషన్, జిల్లా టాస్క్ ఫోర్స్ అధికారులు మరియు కర్ణాటక రాయచూరు ఎక్సైజ్ డివిజన్ అధికారులు సంయుక్తంగా తెలంగాణ మరియు కర్ణాటక రాష్ట్రాల సరిహద్దు తండాలలో దాడులు నిర్వహించారు. కేటిదొడ్డి మండలం వాగుతండా, పూజారి తండా, తూర్పు తండా లో సోదాలు నిర్వహించగా పూజారి తండాలో 5 లీటర్ల సారాను స్వాధీనం చేసుకొన్నారు. ఒక సారాయి బట్టి మరియు 300 లీటర్ల బెల్లం పానకం ను ధ్వంసం చేసి రెండు కేసులు నమోద్రు చేసి ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. అదే విధంగా కర్ణాటక రాష్ట్రంలోని సింగనోడి తండాలో రైడ్ చేసి 2 లీటర్ల సారా స్వాధీనం చేసుకొని 200 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి ఒక వ్యక్తి పై కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో గద్వాల్ స్టేషన్ సీఐ గణపతి రెడ్డి, టాస్క్ ఫోర్స్ సీఐ సైదిరెడ్డి , సిబ్బంది పాల్గొన్నారు.



మంచినీటి సరఫరా పై సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్ బి.ఎం సంతోష్

# ప్రజలకు మంచినీటి సరఫరాల్లో ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయండి

## జిల్లా కలెక్టర్ బి ఎం సంతోష్

**అధికారులను ఆదేశించిన కలెక్టర్**

గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 16(ప్రభాత ఉదయం): జిల్లాలోని అన్ని మున్సిపాలిటీ పరిధిలో త్రాగు నీరు సరఫరా సక్రమంగా జరిగేల చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి.ఎం సంతోష్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలాయములోని కాన్ఫరెన్స్ హాలులో త్రాగు నీటి సరఫరాపై మున్సిపల్ కమిషనర్లు, మిషన్ భగీరథ ఈ.ఈ లు, డి ఈ లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వచ్చే రెండు మాసాలలో ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు రాకుండా అవసరమైన ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. మున్సిపల్ అధికారులు అప్రమత్తంగా ఉంటూ, నీటి సరఫరాలో అంతరాయం కలగకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తు ఉండాలని అన్నారు. ప్రతి వార్డులో ప్రతి ఇంటికి మిషన్ భగీరథ నీరు సరఫరా అయ్యే విధంగా చూడాలని, అవసరం మేరకు స్థానికంగా ఉన్న హ్యాండ్ పంపులు, బోర్వెల్ మోటార్లకు మరమ్మతులు చేయించి అట్టి నీటిని వినియోగించుకునే విధంగా చర్యలు చేపట్టి త్రాగునీటికి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు సమ్మర్ యాక్షన్ ప్లాన్ పై చేపట్టిన పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మిషన్ భగీరథ బల్క్ వాటర్ అవసరం మేరకు సరఫరా చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్ , ఈఈ గ్రిడ్ భీమేశ్వర్ రావు, మున్సిపల్ కమిషనర్లు, డి.ఈలు, ఈ.ఈ. లు తదితరులు పాల్గొనారు.



పార్టీ శ్రేణులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న నాగర్ కర్నూల్ ఎంపీ బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ ప్రవీణ్ కుమార్

# సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాం

## మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

**హామీలను విస్మరించిన కాంగ్రెస్ ను ఓడించాలి: డాక్టర్ ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్**

వనపర్తి జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 16(ప్రభాత ఉదయం) కేసీఆర్ హాయంలో ప్రారంభమైన సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి, బీడు భూములకు సాగునీరు అందిస్తామని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా వనపర్తి జిల్లా ఖిల్లా ఘనపురంలోని పద్మశాలి భవన్ లో జరిగిన పార్టీ మండల స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.వనపర్తి జిల్లాను సస్యశ్యామలం చేసే గణప సముద్రం,బుద్దారం రిజర్వాయర్లను ప్రారంభించిన ఘనత కేసిఆర్ దేనన్నారు.ప్రాజెక్టులను పూర్తి చేయడంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి లేదన్నారు. ప్రాజెక్టు పనులు తక్షణమే పూర్తి చేసి, వచ్చే సీజన్ లో సాగునీరు అందించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. ఆరు గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ ప్రజలకు దొంగ హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను విస్మరించిందని అన్నారు.

**హామీలను విస్మరించిన కాంగ్రెస్ ను ఓడించాలి:డా.ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్**

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో విఫలమైందని నాగర్ కర్నూలు పార్లమెంట్ భారాస అభ్యర్థి డాక్టర్ ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ విమర్శించారు.రాష్ట్రంలో కరువు వచ్చి రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా ప్రభుత్వ స్పందించడం లేదన్నారు.రైతులకు రెండు లక్షల రుణమాఫీ, రైతుబంధు,కళ్యాణ లక్ష్మి కింద ఆడ బిడ్డలకు తులం బంగారం ఇవ్వడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు.స్థానికేతరుడైన కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి మల్లు రవి గతంలోఎంపీ,ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించి ఈ ప్రాంతానికి చేసిన అభివృద్ధి ఏమిటో చూపించాలని డిమాండ్ చేశారు.

భారాస ఎంపీగా గెలిచి, కుమారుడు ఎంపీ టికెట్ కోసం పార్టీ మారిన పోతుగంటి రాములు వెనుకబడిన ప్రాంతాన్ని అభివృద్ధి చేయడంలో పూర్తిగా నిర్లక్ష్యం వహించారన్నారు.ఎంపీ రాములు ఐదేళ్లలో పార్లమెంటులో అడిగిన ప్రశ్నలు కేవలం ఆరు మాత్రమేనన్నారు.ఆయన కుమారుడిని ఈ ప్రాంతం ఎంపీగా గెలిపిస్తే ఏం అభివృద్ధి చేయగలరని ప్రశ్నించారు.అధికార పార్టీ నేతలు భారాస నాయకులను ఎన్ని ప్రలోభాలు పెట్టినా,బెదిరింపులకు పాల్పడినా రానున్న లోక్ సభ ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేసి పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు.ఈ సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్,నాగర్ కర్నూల్ పార్లమెంట్ సోషల్ మీడియా ఇంఛార్జి అభిలాష్ రావు, సీనియర్ నాయకులు ప్రత్యూష, స్థానిక ఎంపీపీ కృష్ణ నాయక్, జెడ్పిటిసి సామ్య నాయక్,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పాలమూరు బిజెపి అభ్యర్థి డీకే అరుణ బిజెపి గెలుపు ఖాయం: బొక్క బాల్ రెడ్డి

**ప్రచారంలో దూసుకుపోతున్న బిజెపి.. ప్రజల నుండి బిజెపికి విశేష స్పందన**



మక్తల్ నియోజకవర్గంలో ఇంటింటికి ప్రచారం నిర్వహిస్తున్న బిజెపి రాష్ట్ర నాయకులు బొక్క బాల్ రెడ్డి



పార్టీ శ్రేణులతో సమావేశమై గెలుపు కోసం చర్చిస్తున్న బొక్క బాల్ రెడ్డి



కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరిస్తూ కమలం గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం నిర్వహిస్తున్న బొక్క బాల్ రెడ్డి

మక్తల్, ఏప్రిల్ 16(ప్రభాత ఉదయం) మహబూబ్ నగర్ పార్లమెంట్ స్థానంలో బిజెపి భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని బిజెపి రాష్ట్ర నాయకులు బొక్క బాల్ రెడ్డి అన్నారు. మంగళవారం భారతీయ జనతా పార్టీ మక్తల్ ,అసెంబ్లీ మహబూబ్ నగర్, పార్లమెంట్, పరిధిలో బొక్క బాల్ రెడ్డి మక్తల్ అసెంబ్లీ ప్రబారి డీకే అరుణమ్మని గెలిపించాలని ఇంటింటికి, బిజెపి, గడపగడపకు, బీజేపీ ప్రచారం నిర్వహించారు . ఈ సందర్భంగా బాల్ రెడ్డి మాట్లాడుతూ... ఎంపీ అభ్యర్థి డీకే అరుణ పట్ల ప్రజలు ఎంతో ఆదరాభిమానాలు కనపరుస్తున్నారని కమలం గుర్తుకు ఓటు వేసి వారి మెజార్టీతో గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు అన్నారు. మక్తల్ పోలింగ్ బూత్ నంబర్ 138, కృష్ణ మండల్ 78 పోలింగ్ బూతులలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర వర్గ సభ్యులు కొమురయ్య , జిల్లా కార్యదర్శి కల్లూరి నాగప్ప , జిల్లా ఉపాధ్యక్షులు సోమశేఖర్ గౌడ్ , మక్తల్ అసెంబ్లీ కన్వీన కర్ణ స్వామి , ఎంపీటీసీ బలరాం రెడ్డి, బిజెపి రాష్ట్ర నాయకులు రవీందర్ రెడ్డి , మల్లికార్జున్, లక్ష్మణ్, మక్తల్ మండలం బిజెపి అధ్యక్షులు ,శ్రీనివాసులు ,కృష్ణ మండల్ బిజెపి అధ్యక్షులు, మజ్జిగ సురేష్, రాఘవేందర్, 92 బూత్ అధ్యక్షుడు వెంకటేష్, 93 బూత్ అధ్యక్షుడు కరెప్ప, 94వ బూత్ అధ్యక్షుడు దశరథ్ ,95 భూతాక్షుడు దండు శ్రీనాథ్, 96 భూతద్దచుడు, వీరప్ప , బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. “RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.